# Telangana Rythu JAC తెలంగాణా రైతు జే.ఏ.సి

**ప్రెస్ నోట్:** తేది: 01-08-2015

## వ్యవసాయ కుటుంబాల సంక్షోభంపై సంఘటితంగా ఉద్యమించేందుకు

# తెలంగాణా రైతు జే.ఏ.సి. ఆవిర్భావం

తన కొరకు, తన కుటుంబం కొరకు వ్యవసాయం చేసినన్ని రోజులు రైతు మార్కెట్ శక్తుల నుండి స్వతంత్రంగానే బతికినాడు. కానీ మంది కొరకు, మార్కెట్ కొరకు వ్యవసాయం ప్రారంభించినప్పటి నుండి రైతు కార్పొరేట్ శక్తుల, మధ్య దళారుల వలలో చిక్కుకుని నిరంతరం దోపిడీకి గురవుతున్నాడు. ఈ దోపిడీ కారణంగానే బతుకుదెరువు కోల్పోయి, బతుకు ఆగమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. గత 20 సంవత్సరాలలో తెలంగాణా రాష్ట్ర పరిధిలో 28,000 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

తెలంగాణా వ్యవసాయదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయి వున్నారు. వ్యవసాయదారులకు సరియైన ఆదాయం లేకపోవడం, పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడం, బ్యాంకు రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం లాంటివి అందరికీ సమగ్రంగా అందకపోవడం, కల్తీ విత్తనాలు, పురుగు విషాలు రాజ్యమేలడం వంటివి ఈ సంక్షోభానికి కారణాలుగా వున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఈ దోపిడీకి ఆంధ్ర పాలకుల వివక్ష తోడయి, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణా సాగు నీటి రంగంలో తీవ్ర నిర్లక్ష్యానికి లోనైంది. తెలంగాణా వ్యవసాయంలో బోరు బావులపై రైతులు స్వయంగా లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టడం, విద్యుత్ కోతలు, తదితర కారణాలు సంక్షోభాన్ని తీవ్రతరం చేశాయి.

ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే విధంగా కాకుండా, ప్రైవేటు, కార్పోరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే విధంగానే విధానాలను రూపొందించి, అమలు చేయడం వల్ల, వ్యవసాయ కుటుంబాలు సంక్షోభం నుండి బయట పడడం లేదు. ఆత్మహత్యలూ ఆగడం లేదు.

ఈ ప్రత్యేక పరిస్థితిని దృష్టిలో వుంచుకుని, తెలంగాణా వ్యవసాయ కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ఆలోచించే కొన్ని రైతు సంఘాలు, కొంత మంది మేధావులు, శాస్త్రవేత్తలు వ్యవసాయరంగ సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు "తెలంగాణా రైతు జే.ఏ.సి." ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించాయి. "తెలంగాణా రాష్ట్ర వ్యవసాయదారుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్మించడం, అంతిమంగా రైతుల ఆత్మహత్యలు లేని తెలంగాణాను రూపొందించుకోవడం" ఈ జే.ఏ.సి. ప్రధాన లక్ష్యంగా వుంటుంది.

**జే.ఏ.సి. లక్ష్యాలు:**

1. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు కార్పోరేట్ దోపిడీ నుండి రక్షణ కల్పించి ఆదాయ భద్రత తీసుకువచ్చే వ్యవసాయ విధానాలు.
2. దీర్ఘకాలిక పర్యావరణ రక్షణ వుండే విధంగా వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం.
3. వ్యవసాయానికి అవసరమైన సహజ వనరులు గ్రామీణ, ఆదివాసీ ప్రజల చేతిలో వుండే విధంగా హక్కులు సాధించడం.
4. రైతుల ఆత్మహత్యలను నివారించడం.

(తెలంగాణా రైతు జే.ఏ.సి దృష్టిలో రైతు అంటే అర్థం – భూమిపై పట్టా హక్కులు కలిగిన రైతులు అని మాత్రమే కాదు, వాస్తవ సాగుదారులుగా వున్న కౌలు రైతులు, మహిళా రైతులు, ఆదివాసీ రైతులు, అసైన్డ్ భూమి పొందిన రైతులు, వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే వ్యవసాయ కూలీలు కూడా.)

**తక్షణ కార్యాచరణ:**

రైతు జే.ఏ.సి. ఆగస్టు మొదటి వారంలో కరువు ప్రాంతాలను పరిశీలించడం, రైతు ఆత్మహత్య కుటుంబాలను పరామర్శించడం, తక్షణ సమస్యల పరిష్కారానికి రైతులను సమీకరించడం చేస్తుంది. తెలంగాణా రైతాంగ సమస్యలపై ఈ క్రింది మూడు తక్షణ డిమాండ్లను రైతు జే.ఏ.సి ప్రభుత్వం ముందు పెడుతున్నది.

**తక్షణ డిమాండ్లు:**

1. రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు నష్ట పరిహారాన్ని 5 లక్షల రూపాయలకు పెంచాలి. రైతు ఆత్మహత్యలను వెంటనే గుర్తించి, ఆయా కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా, రుణ విముక్తి, విద్యా వైద్య సౌకర్యాలు కల్పించాలి, జీవనోపాధికి సహకారం అందించాలి.
2. గత సంవత్సరం కరువు, అకాల వర్షాలు, వడగండ్ల వలన పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలి. ఈ సీజన్లో వర్షాభావ పరిస్థితులలో రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలి.
3. రుణమాఫీకి అర్హత పొందిన రుణాలను బ్యాంకులు పూర్తిగా ప్రభుత్వ రుణంగా గుర్తించి, రైతులను పూర్తి రుణ విముక్తులను చెయ్యాలి. ఈ సంవత్సరం కౌలు రైతులతో సహా రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్సు ప్రకారం పూర్తి పంట రుణాలను వెంటనే ఇవ్వాలి.

**తెలంగాణా రైతు జే.ఏ.సి. తాత్కాలిక కమిటీ**

రైతు జే.ఏ.సి. కార్యనిర్వహణ కొరకు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, చాలా కాలంగా రైతుల కోసం కృషి చేస్తున్న **డా॥ ఎల్.జలపతిరావు** కన్వీనర్‌గా తాత్కాలిక కమిటీ ఏర్పడింది. కమిటీ సభ్యుల వివరాలను మీడియాకు విడుదల చేస్తున్నాము.

**తెలంగాణా రైతు జే.ఏ.సి. తాత్కాలిక కమిటీ సభ్యుల వివరాలు**

| వ.సం | పేరు | సంస్థ పేరు |
|---|---|---|
| 1. | డా॥ ఎల్. జలపతి రావ్ | రాష్ట్ర కన్వీనర్ – రైతు జే.ఏ.సి. |
| 2. | ప్రొ॥ యం. కోదండరామ్ | రైతు జే.ఏ.సి |
| 3. | ప్రొ॥ కె.ఆర్. చౌదరి | రైతు జే.ఏ.సి |
| 4. | ప్రొ॥ అల్తాస్ జానయ్య | రైతు జే.ఏ.సి. |
| 5. | డా॥ జి.వి. రామాంజనేయులు | రైతు జే.ఏ.సి |
| 6. | డా॥ ఎస్. సీతాలక్ష్మి | రైతు స్వరాజ్య వేదిక |
| 7. | కె. రవి | రైతు స్వరాజ్య వేదిక |
| 8. | విస్సా కిరణ్ కుమార్ | రైతు స్వరాజ్య వేదిక |
| 9. | కె. అచ్యుత రామారావు | అఖిలభారత రైతుకూలీ సంఘం |
| 10. | మండల వెంకన్న | అఖిలభారత రైతుకూలీ సంఘం |
| 12. | పాకాల శ్రీహరిరావు (మెదక్) | తెలంగాణా రైతు రక్షణ సమితి |
| 13. | పి. శంకర్ | దళిత బహుజన ఫ్రంట్ |
| 14. | మోర్తాల చందర్ రావ్ | తెలంగాణా రైతు సంఘం |
| 15. | మచ్చా విద్యాసాగర్ | తెలంగాణా రైతాంగ సమితి |
| 16. | నర్సింహారెడ్డి | తెలంగాణా రైతాంగ సమితి |
| 17. | శ్రీధర్ రెడ్డి | భారతీయ కిసాన్ సంఘ్ |
| 10. | వర్యాద అంజిరెడ్డి | భారతీయ కిసాన్ సంఘ్ |
| 19. | గురిజాల రవీందర్‌రావు | తెలంగాణా విద్యావంతుల వేదిక |
| 20. | వెంకట్‌రెడ్డి (కరీంనగర్) | తెలంగాణా రాష్ట్ర రైతు ఐక్య వేదిక |
| 21. | ఆశాలత | మహిళా రైతుల హక్కుల వేదిక |
| 22. | నర్సింహనాయుడు (నిజామాబాద్) | పసుపు రైతుల సంఘం |
| 23. | అశోక్ కుమార్ | డిప్యూటి డైరెక్టర్ అగ్రికల్చర్ (రిటైర్డ్) |
| 24. | సదానంద రావు | నల్లగొండ |
| 25. | నైనాల గోవర్ధన్ | తెలంగాణా జల సాధన సమితి |
| 26. | విఠల్ రావు ఆర్య (మహబూబ్‌నగర్) | ఆర్యసమాజ్ |
| 27. | కె. పర్వతాలు | దళిత బహుజన కూలీ రైతు సంఘం |
| 28. | కనకవ్వ (మెదక్) | రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల వేదిక |

**డా॥ఎల్. జలపతి రావు**
కన్వీనర్, తెలంగాణా రైతు జే.ఏ.సి.

**మరిన్ని వివరాలకు : విస్సా కిరణ్ కుమార్ ఫోన్: 9701705743, కె. రవి, ఫోన్: 9912928422**

# తెలంగాణా రైతు జే.ఏ.సి. ఆవిర్భావం

తన కొరకు, తన కుటుంబం కొరకు వ్యవసాయం చేసినన్ని రోజులు రైతు మార్కెట్ శక్తుల నుండి స్వతంత్రంగానే బతికినాడు. కానీ మంది కొరకు, మార్కెట్ కొరకు వ్యవసాయం ప్రారంభించినప్పటి నుండి రైతు కార్పొరేట్ శక్తుల, మధ్య దళారుల వలలో చిక్కుకుని నిరంతరం దోపిడీకి గురవుతున్నాడు. ఈ దోపిడీ కారణంగానే బతుకుదెరువు కోల్పోయి, బతుకు ఆగమై ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. ఈ పరిస్థితికి తోడు, వ్యవసాయానికి కావాల్సిన వనరులు దొరకని స్థితి వల్ల రైతుల జీవితం మరింత దుర్భరమవుతున్నది. ఆ విధంగా తీవ్ర సంక్షోభం వున్న ప్రాంతాలలో తెలంగాణా ఒకటి.

తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ కుటుంబాలు తీవ్ర సంక్షోభంలో వున్నాయి. ముఖ్యంగా వ్యవసాయదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయి వున్నారు. వ్యవసాయ కుటుంబాలకు ఆదాయ భద్రత లేకపోవడం, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు రాకపోవడం, ప్రభుత్వ వ్యవసాయ సబ్సిడీ పథకాలు రైతులందరికీ చేరక పోవడం, సంస్థాగత రుణాలు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం లాంటివి అందరికీ సమగ్రంగా అందకపోవడం ఈ సంక్షోభానికి కారణాలుగా వున్నాయి.

మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఈ దోపిడీకి ఆంధ్ర పాలకుల వివక్ష తోడయింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణా సాగు నీటి రంగంలో తీవ్ర నిర్లక్ష్యానికి లోనైంది. పాలకుల విధానాల కారణంగానే సాగు నీటి సౌకర్యానికై రైతులే పెట్టుబడి పెట్టవలసి వచ్చింది. తెలంగాణా వ్యవసాయంలో బోరు బావులపై రైతులు స్వయంగా లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టడం, విద్యుత్ కోతలు, మోటార్లు కాలిపోవడం, కరువులు, వర్షాభావ పరిస్థితులలో పంటల దిగుబడులు తగ్గిపోవడం, కల్తీ విత్తనాలు, పురుగు విషాలు రాజ్యమేలడం, రసాయన ఎరువుల ధరలు పెరగడం, మార్కెట్ వ్యవస్థలో దళారుల దోపిడీ, క్షేత్ర స్థాయిలో గిడ్డంగులు, శీతల గిడ్డంగుల లాంటి కనీస మౌళిక వసతులు లేక పోవడం, తదితర కారణాలు సంక్షోభాన్ని తీవ్రతరం చేశాయి.

విద్యా, వైద్యం, గృహ నిర్మాణం లాంటి విషయాలలో ప్రభుత్వం రంగం నుండి తప్పుకుని, ప్రైవేటు పరం చేయడం కారణంగా వ్యవసాయ కుటుంబాల జీవన వ్యయం పెరగడం కూడా రైతు కుటుంబాలను కోలుకోలేకుండా చేస్తున్నది.

ముఖ్యంగా సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు ఈ సంక్షోభాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. ఈ దశలోనే గ్రామీణ ప్రాంతంలో సాంఘికంగా భరోసానిచ్చే వ్యవస్థలు కూడా బలహీనపడ్డాయి. రైతాంగ ఉద్యమాలు బలహీన పడ్డాయి. ఈ పరిణామం, వ్యవసాయ కుటుంబాలను నిస్సహాయ స్థితిలోకి నెట్టివేసింది. ఫలితంగా గత 20 సంవత్సరాలలో తెలంగాణా రాష్ట్ర పరిధిలో 28,000 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా, ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే విధంగా కాకుండా, ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే విధంగానే విధానాలను రూపొందించి, అమలు చేయడం వల్ల, వ్యవసాయ కుటుంబాలు సంక్షోభం నుండి బయట పడడం లేదు. ఆత్మహత్యలూ ఆగడం లేదు.

రాష్ట్రంలో అనేక రైతు సంఘాలు వున్నాయి. ఈ రైతు సంఘాలు వ్యవసాయ రంగ సమస్యల పట్ల ఆందోళనా, ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాయి. కానీ ఈ కృషి వ్యవసాయ సమాజాన్ని సంఘటిత పరిచి, ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి, రైతు అనుకూల విధానాలను సాధించే స్థితిలో లేదు. ఈ నేపథ్యంలో సమస్యలు పెరుగుతున్నాయి. పరిష్కారాలు, ఫలితాలు తక్కువగా వుంటున్నాయి.

ఈ ప్రత్యేక పరిస్థితిని దృష్టిలో వుంచుకుని, తెలంగాణా వ్యవసాయ కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా ఆలోచించే కొన్ని రైతు సంఘాలు, కొంత మంది మేధావులు, శాస్త్రవేత్తలు వ్యవసాయ రంగ సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు "తెలంగాణా రైతు జే.ఏ.సి." ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించాయి.

"తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ దారుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు నిర్మించడం, అంతిమంగా రైతుల ఆత్మహత్యలు లేని తెలంగాణాను రూపొందించుకోవడం" ఈ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన లక్ష్యంగా వుంటుంది.

**జే.ఏ.సి. లక్ష్యాలు:**

1. **వ్యవసాయం పైన ఆధార పడిన కుటుంబాలను కార్పోరేట్ దోపిడీ నుండి రక్షణ కల్పించి ఆదాయ భద్రత తీసుకువచ్చే విధంగా వ్యవసాయ విధానాలు.**
2. **దీర్ఘకాలిక పర్యావరణ రక్షణ వుండే విధంగా వ్యవసాయ పద్దతులకు ప్రోత్సాహం.**
3. **ఉత్పత్తికి అవసరమైన సహజ వనరులు గ్రామీణ, ఆదివాసీ ప్రజలకు అందుబాటులో వుండే విధంగా హక్కులు సాధించడం.**
4. **రైతుల ఆత్మహత్యలను నివారించడం.**

పై లక్ష్యాలతో తెలంగాణా రాష్ట్రంలోని రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, వ్యవసాయంతోనూ, రైతులతోనూ పనిచేస్తున్న ఇతర సంస్థలు, వ్యక్తులు కలిసి పని చేయటం కోసం **తెలంగాణా రైతు జే.ఏ.సి.** ఆవిర్భవించింది.

ఈ విధి విధాన పత్రంలో రైతు అని వాడుతున్నామంటే, దాని అర్థం – భూమిపై పట్టా హక్కులు కలిగిన రైతులు అని మాత్రమే కాదు. భూమిపై హక్కులు లేకపోయినా వాస్తవ సాగుదారులుగా వున్న కౌలు రైతులు, మహిళా రైతులు, ప్రభుత్వ భూ పంపిణీ పథకాలలో భూమి పొందిన దళిత, ఆదివాసీ రైతులు, వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే వ్యవసాయ కూలీలు కూడా.

**ఈ క్రింది లక్ష్యాల సాధనకై రైతు జే.ఏ.సి. కృషి చేస్తుంది**

1. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు – అ) రైతుల ప్రయోజనాలకు, తెలంగాణా భౌగోళిక పరిస్థితులకు అనువైన వ్యవసాయ విధానాలు రూపొందించేలా చూడటం, ఆ) వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన సంస్థలను ప్రభుత్వాలు ఏర్పాటు చేసేలా, వున్న వాటిని బలోపేతం చేసేలా చూడటం, ఇ) పర్యావరణ హితమైన వ్యవసాయ సాంకేతిక అభివృద్ధి ఉండేలా చూడటం.
2. రైతుల ఆత్మహత్యలను నివారించేలా, గ్రామీణ ప్రాంతం నుండి బలవంతపు వలసలను ఆపేలా, బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధులను కల్పించేలా ప్రభుత్వాల విధానాలు ఉండేలా చూడడం.
3. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరిగేలా, అవి వాస్తవ సాగుదారులకు, ముఖ్యంగా చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు ఎక్కువగా అందేలా చూడటం, కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు అయ్యేలా, ఫలితాలు పారదర్శకంగా ఉండేలా చూడటం.
4. రైతులకు అవసరమైన వ్యవసాయ మద్దతు వ్యవస్థలను – న్యాయమైన గిట్టుబాటు ధరలు, వాస్తవ సాగుదారులందరికీ వ్యవసాయ రుణాలు, సమగ్రమైన పంటల బీమా పథకం, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో న్యాయమైన పరిహారం, నూతన సబ్సిడీ పథకాలు, తెలంగాణా భౌగోళిక పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ పరిశోధనలు, వ్యవసాయశాఖ రైతులకు అందుబాటులో వుండటం, వ్యవసాయ మార్కెట్‌లకు చట్టబద్ధత కల్పించడం తదితర అంశాలలో – ప్రభుత్వాలు బలోపేతం చేసేలా చూడటం.
5. వ్యవసాయ రంగంలో మార్కెట్ నియంత్రణా వ్యవస్థలు రైతాంగానికి ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు అనువుగా వుండేలా చూడటం.
6. రైతులకు సాంకేతిక విజ్ఞానాన్ని, సామాజిక సమస్యలపైన అవగాహనను కల్పించటం.
7. ఇతర రంగాలతో సమానంగా వ్యవసాయ కుటుంబాలకు సామాజిక భద్రత ప్రభుత్వాలు కల్పించేలా చూడటం.
8. సమగ్రమైన, శాస్త్రీయమైన, న్యాయమైన జల విధానం రూపొందించేలా, అమలు చేసేలా చూడడం.

**జే.ఏ.సి. కార్యాచరణ:**

1. శాంతియుతమైన, ప్రజాస్వామికమైన కార్యాచరణను రూపొందించుకుంటుంది.
2. వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసే ప్రభుత్వ విధానాలు, పనితీరు, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు తదితర అంశాలపై సామాజిక తనిఖీ చేపడుతుంది.
3. వ్యవసాయ కుటుంబాల సంక్షోభానికి కారణమవుతున్న వివిధ అంశాల పై అధ్యయనం, నిర్దిష్ట డిమాండ్ల రూప కల్పన చేస్తుంది.
4. వ్యవసాయ సంక్షోభ కారణాలపై, సంక్షోభం నుండి బయట పడేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయాలపై రైతులకు, ఇతర సమాజానికి అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తుంది.
5. ప్రభుత్వంతో, ఇతర వ్యవసాయ రంగ సంస్థలతో చర్చించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
6. సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయదారులను సమీకరిస్తుంది. బలమైన ఉమ్మడి ఉద్యమ నిర్మాణం చేస్తుంది.